www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 18 ఆగస్టు 2025

5

ఏలూరు

నేడు డిఆర్‌సి సమావేశం

జిల్లా అభివృద్ధిపై ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ సమీక్ష

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లా అభివృద్ధి సమీక్ష కమిటీ సమావేశం జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అధ్యక్షతన ఈ నెల 18వ తేదీ సోమవారం మధ్యాహ్నం 3.30 గంటలకు కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో జరగనుంది. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి, ఎంపీ, ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలు, జిల్లా అధికారులు పాల్గొననున్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ, ఉద్యానవన, పంచాయతీ రాజ్, ఆర్‌అండ్‌బి, ఆర్‌డబ్ల్యూఎస్ పెండింగ్ పనులు, గ్యాప్ అనాలిసిస్ రిపోర్ట్, ఎంఎస్‌ఎంఇ పార్కులు, పౌరసరఫరాలు, స్త్రీ శక్తి పథకం, గోదావరి వరద రిలీఫ్ ఆపరేషన్స్ తదితర అంశాలపై సమీక్షిస్తారు.

ఏజెన్సీ బెంబేలు.. కొల్లేరులో కలవరం..!

జిల్లాను చుట్టుముడుతున్న వరద
భద్రాచలం వద్ద 34 అడుగులకు చేరిన గోదావరి నీటిమట్టం
43 అడుగులకు చేరితే మొదటి ప్రమాద హెచ్చరిక జారీ
పొంగుతున్న గుండేటి, ఎద్దువాగులు
పలు గ్రామాలకు నిలిచిన రాకపోకలు
కుక్కునూరు, వేలేరుపాడు మండలాల ప్రజల్లో ఆందోళన
కొల్లేరులో పెనుమాక గ్రామం రహదారిపైకి వరద నీరు
భయంభయంగా లంక గ్రామాల ప్రజలు
పెదఅడ్లగాడి వద్ద 2.46 మీటర్లకు చేరిన నీటి మట్టం
కలెక్టరేట్‌లో కంట్రోల్ రూంలు ఏర్పాటు..
పిజిఆర్‌ఎస్ కార్యక్రమం రద్దు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

జిల్లాను వరద చుట్టుముడుతున్న పరిస్థితి నెలకొంది. గోదావరి వరద ఉధృతి పెరుగుతుండగా, కొల్లేరుకు వరద నీరు పోటెత్తుతోంది. దీంతో అటు ఏజెన్సీ ప్రజలు, ఇటు కొల్లేరు లంక గ్రామాల ప్రజలు భయంభయంగా కాలం వెళ్లదీస్తున్న పరిస్థితి. గత ఏడాది వరద పరిస్థితులను గుర్తుచేసుకుని ఏజెన్సీ, కొల్లేరు ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఆదివారం సాయంత్రానికి భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 33.70 అడుగులకు చేరింది.

పట్టిసీమ వద్ద పెరుగుతున్న వరద

సోమవారం ఉదయానికి మరింత పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. దీంతో భద్రాచలం వద్ద 5.57 లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో పోలవరం స్పిల్‌వే వద్ద నీటి మట్టం 30 అడుగులు దాటేసింది. దిగువకు ఐదు లక్షల 52 వేల క్యూసెక్కులపైగా నీటిని విడుదల చేస్తున్నారు. భద్రాచలం వద్ద గోదావరి నీటి మట్టం 43 అడుగులకు చేరితే మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేయనున్నారు. గడిచిన నెలలో రెండు సార్లు గోదావరికి వరద పోటెత్తింది. వెంటనే తగ్గుముఖం పట్టడంతో అక్కడి ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. భద్రాచలం వద్ద నీటిమట్టం 40 అడుగులు దాటితే కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని 35కు పైగా గ్రామాలు ముంపు బారిన పడే ప్రమాదం ఉంది. ఇప్పటికే కుక్కునూరు, దాచారం మధ్యలో ఉన్న గుండేటివాగు పొంగిపొర్లుతుండడంతో 12 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వేలేరుపాడు మండలంలో ఎద్దువాగుపై కాజ్‌వేపై నీరు చేరడంతో కోయిదా, తాళ్లగొంది, పూచిగొంది, కాకిసనూరు, వంటి 20 గ్రామాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఏటా కుక్కునూరు, వేలేరుపాడు మండలాల ప్రజలు వరదలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం నిర్వాసితులకు ఇవ్వాల్సిన పునరావాసం, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ, 18 ఏళ్లు నిండిన యువతకు పరిహారం, కాలనీలు నిర్మాణం వంటి ఏ ఒక్కటీ సక్రమంగా చేయకుండా నిర్వాసితులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. ఈ ఏడాది మే నెల నాటికి 41.15 కాంటూరు పరిధిలోని గ్రామాలకు పునరావాసం, ఆర్‌అండ్‌ఆర్ పూర్తిచేస్తామని ప్రభుత్వం చెప్పినా చేయలేదు. దీంతో నిర్వాసితులు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. తమకు వెంటనే పరిహారం అందించాలని నిర్వాసితులు కోరుతున్నారు.

కొల్లేరుకు వరద కలవరం..

బుడమలేరుతోపాటు ఎగువ ప్రాంతాల నుంచి కొల్లేరుకు పెద్దఎత్తున వరదనీరు వచ్చిపడుతోంది. దీంతో కొల్లేరులో వరద పెరుగుతుండడంతో లంక గ్రామాల ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. పెద్దఅడ్లగాడి వద్ద కొల్లేరు నీటిమట్టం 2.46 మీటర్లకు చేరింది. దీంతో పెనుమాకలంక రహదారిపైకి వరద నీరు చేరుకుని పెద్దఅడ్లగాడి, పెనుమాకలంక, నందిగామ, శ్రీరామ్‌నగర్ మీదుగా సిద్ధాంతానికి రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో పడవలపై అక్కడి ప్రజలు ప్రయాణిస్తున్న పరిస్థితి. ఒకవైపు వర్షాలు, మరోవైపు వరదనీటితో లంక గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. పెద్దఅడ్లగాడి వద్ద మూడు మీటర్లకు కొల్లేటి నీటిమట్టం పెరిగితే కొల్లేరులోని చాలా గ్రామాలు జలదిగ్బంధనంలో చిక్కుకోనున్నాయి. ఇళ్లలోకి నీరు చేరే ప్రమాదం పొంచి ఉంది. ఎగువ ప్రాంతాల్లోని ముంపు నీరు 64 డ్రెయిన్ల ద్వారా ప్రవహిస్తూ వచ్చి కొల్లేరు ద్వారా సముద్రంలోకి చేరుతాయి. కొల్లేరులో అక్రమంగా తవ్విన చేపల చెరువులు, అక్రమణల కారణంగా వరదనీరు ముంచెత్తుతోంది. పెదఅడ్లగాడి వంతెన వద్ద భారీ స్థాయిలో మేట వేసిన గుర్రపు డెక్కను సకాలంలో తొలగించకపోవడంతో ముంపునకు మరో కారణంగా కనిపిస్తోంది.

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్‌లు.. పిజిఆర్‌ఎస్ రద్దు

పెరుగుతున్న వరద నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. జిల్లా కలెక్టరేట్‌లో 18002331077, 9491041419 ఫోన్ నెంబర్లతో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశారు. ప్రజలు నదిలోకి వెళ్లొద్దని, ఈతకు వెళ్లడం, చేపలు పట్టడం వంటివి చేయొద్దని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో సోమవారం జరిగే పిజిఆర్‌ఎస్ కార్యక్రమాన్ని అధికారులు రద్దు చేశారు.

పెరుగుతున్న వరద ఉధృతి..

వేలేరుపాడు రూరల్ : ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు జలాశయాలు, నదులు ఉప్పొంగడంతో వాగులు, వంకలు పొంగిపొర్లి గోదావరికి పోటెత్తి ఉధృతంగా ప్రవహిస్తోంది. భద్రాచలం వద్ద గోదావరి ఆదివారం సాయంత్రానికి 34 అడుగులు దాటి ప్రవహిస్తుండడంతో లోతట్టు ప్రాంతాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. భద్రాచలానికి ఎగువ భాగాన న్న శ్రీరామ్‌సాగర్, వెల్లంపల్లి ప్రాజెక్టు, కడియం జలాశయాల్లో వరద నీరు చేరి ఉధృతంగా ప్రవహించడంతో గేట్లు ఎత్తి దిగువకు కొన్ని వేల క్యూసెక్కుల నీళ్లు వదలడంతో 40 నుంచి 45 అడుగుల మేరకు చేరుకునే అవకాశం ఉందని, లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. వేలేరుపాడు నుంచి కోయిదా వెళ్లే మార్గంలో యడవల్లి వద్ద ఉన్న ఎద్దువాగు కాజ్‌వే మునిగిపోవడంతో రహదారి సౌకర్యం లేక కట్కూరు, కోయిదా, టేకూరు, తాళ్లగొంది, పూచిగొంది, సిద్ధారం, కాకిసనూరు, తదితర సుమారు 20 గ్రామాలకు రహదారి సౌకర్యం లేక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో మండల కేంద్రాన్ని చేరుకోవాలంటే పడవపై ఎద్దువాగు దాటి ప్రయాణించాల్సిన పరిస్థితి.



దాచారం మధ్య గుండేటి వాగు కాజ్వే పైకి చేరిన వరద నీరు

12 గిరిజన గ్రామాలకు స్తంభించిన రాకపోకలు

కుక్కునూరు రూరల్ : నాలుగు రోజులుగా ఏజెన్సీ ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వాగులూ, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతోపాటు ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు ప్రాజెక్టులు నిండుకుండలా మారాయి. సామర్థ్యానికి మించి ఉన్న నీటిని దిగువకు వదులుతుండడంతో గోదావరికి భారీగా వరద నీరు పోటెత్తుతోంది. శనివారం భద్రాచలంలో 29 అడుగులున్న గోదావరి నీటిమట్టం ఆదివారానికి 33.7 అడుగులకు చేరుకుని క్రమంగా పెరుగుతోంది. గోదావరికి క్రమంగా పెరగడంతో ఆదివారం గుండేటివాగు కాజ్‌వేపైకి వరద నీరు చేరి ముంచెత్తడంతో దాచారం, బెస్తగూడెం, సీతారాంపురం, నెమలిపేట, ఉప్పర మద్దిగట్ల, అరవపల్లి, గొమ్ముగూడెం, లచ్చిగూడెం తదితర 12 గిరిజన గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి రావాలంటే చుట్టూ 15 కిలోమీటర్లు తిరిగి తీవ్ర ఇబ్బందులు పడుతూ రావాల్సిన పరిస్థితి. వరద పెరుగుతుండడంతో ముంపు మండలాల ప్రజలు కంటిమీద కునుకు లేకుండా బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు.

5,52,343 క్యూసెక్కుల నీరు విడుదల

పోలవరం : అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరిలోకి ఎగువ రాష్ట్రాల నుంచి వస్తున్న ఉపనదులు, కొండవాగుల జలాలు చేరుతుండడంతో ఆదివారం సాయంత్రానికి నీటిమట్టం భారీగా పెరిగింది. ప్రాజెక్టు స్పిల్‌వేలోకి అదనంగా వస్తున్న 5,52,343 క్యూసెక్కుల జలాలను జల వనరుల శాఖ అధికారులు దిగువకు విడుదల చేశారు. ప్రాజెక్టు స్పిల్‌వే ఎగువన 30.400 మీటర్లు స్పిల్‌వే దిగువన 21.100 మీటర్లు, ఎగువ కాపర్ డ్యాం ఎగువన 30.840 మీటర్లు దిగువ కాపర్ డ్యాం దిగువన 20.850 మీటర్లు, ఎగువ దిగువ కాపర్ డ్యాముల మధ్య 15.770 నమోదైనట్లు జలవనరుల శాఖ అధికారులు తెలిపారు. ప్రస్తుతం పోలవరం వద్ద గోదావరి నీటిమట్టం 9.63 మీటర్లు నమోదైనట్లు సిడబ్ల్యూసి అధికారులు తెలిపారు.

పడవపై ప్రజలను తరలిస్తున్న దృశ్యం

కొల్లేరుకు భారీగా ముంపునీరు

నిలిచిన రాకపోకలు - భయాందోళనలో కొల్లేటి వాసులు

ప్రజాశక్తి - మండవల్లి

కొల్లేరులో మితిమీరిన ఆక్రమణలు కొల్లేరు పరివాహక ప్రాంత లంక గ్రామాలకు శాపంగా మారాయి. ముంపునీటి ప్రవాహానికి ఆక్రమణలు అడ్డుపడడంతో లంక గ్రామాలను జలదిగ్బంధనం చేస్తున్నాయి. నవంబర్లో సంభవించిన ముంపు పరిస్థితిని మరువకముందే ఎగువ ప్రాంతాల నుంచి కొల్లేరుకు వచ్చి చేరుతున్న వర్షపు నీరు కొల్లేటి ప్రాంత ప్రజల గుండెల్లో దడ పుట్టిస్తోంది. 2.46 మీటర్ల నీటి మట్టానికి పెదఅడ్లగాడి, పెనుమాక లంక రహదారి పైకి నీరు ప్రవహిస్తూ రాకపోకలు స్తంభించడంతో లంక గ్రామాలు భయం గుప్పెట్లోకి చేరిపోయాయి. ఏ సమయంలో ఏ ప్రమాదం సంభవిస్తుందో తెలియక లంకగ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కొల్లేరులో పెరిగిన ఆక్రమణలు ముంపు సమయాల్లో కొల్లేటి గ్రామాలకు దినదిన గండం నూరేళ్ళ ఆయుష్షుగా మారాయని గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కొల్లేరు సరస్సులోకి వరద నీరు పెద్ద ఎత్తున వచ్చి చేరుతోంది. తుపాను ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు ఎగువ ప్రాంతాల్లోని ముంపు నీరు పలు డ్రెయిన్ల ద్వారా కొల్లేరులోకి వచ్చి చేరడంతో కొల్లేరు నీటిమట్టం పెరుగుతోంది. ఎగువ ప్రాంతాల్లోని ముంపు నీరు 64 డ్రెయిన్ల ద్వారా ప్రవహిస్తూ కొల్లేరు ద్వారా సముద్రంలోకి వెళ్లాల్సి ఉంది. నీటి ప్రవాహానికి కొల్లేరు మాఫియా కొల్లేరులో అక్రమంగా తవ్విన చాపల చెరువులు అడ్డుపడడంతో లంక గ్రామాలకు రాకపోకలు తెగిపోయి జలదిగ్బంధనంలో చిక్కుకుపోతున్నాయి. దీనికి తోడు పెద్దఅడ్లగాడి వంతెన వద్ద భారీ స్థాయిలో మేట వేసిన గుర్రపు డెక్కను సకాలంలో తొలగించకపోవడంతో ముంపునకు మరో కారణంగా తెలుస్తోంది. ఆదివారం పెద్దఅడ్లగాడి వంతెన వద్ద 2.46 మీటర్లకు నమోదైన ముంపు పెదఅడ్లగాడి, పెనుమాకలంక రహదారిపైకి నీరు చేరుకుని పెదడ్లగాడి, పెనుమాకలంక, నందిగామ, శ్రీరామనగర్ మీదుగా సిద్ధాంతానికి రాకపోకలు తెగిపోవడంతో పాటు పడవలపై ప్రయాణిస్తున్న పరిస్థితి. దీంతో లంక గ్రామాల ప్రజలను భయాందోళనకు గురవుతున్నారు. మరో 3 మీటర్ల మేర కొల్లేటి నీటిమట్టం పెరిగితే గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకుపోవడంతో పాటు ఇళ్లల్లోకి నీరు చేరుకునే పరిస్థితులు నెలకొంటాయని లంక గ్రామాల ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం కొల్లేరుకు వచ్చి చేరుతున్న ముంపునీటితో ఇంకేం ప్రమాదం పొంచి ఉందో అని ప్రజలు భయం గుప్పెట్లో అల్లాడిపోతున్నారు. ప్రవాహానికి అడ్డుకట్టుగా ఉన్న కొల్లేరు మాఫియాకు చెందిన చెరువులను ధ్వంసం చేసి ముంపు నీరు సముద్రంలోకి వెళ్లేలా చర్యలు తీసుకోవాలని కొల్లేటి ప్రాంత ప్రజలు వేడుకుంటున్నారు.

చర్యలు తీసుకుంటాం : తహశీల్దార్ గోపాల్

ఎగువ ప్రాంతాల నుంచి ముంపు నీరు కొల్లేరులోకి వచ్చి చేరుతున్న నేపథ్యంలో లంక గ్రామాలకు ఇబ్బందులు తలెత్తకుండా అని చర్యలూ తీసుకున్నాం. పెదఅడ్లగాడి, పెనుమాకలంక రహదారి వద్ద పరిస్థితిని పరిశీలించి రాకపోకలు నిలుపుదల చేశామన్నారు. ముంపు నీరు సముద్రంలోకి వెళ్లే ప్రవాహానికి అడ్డుగా ఉన్న గుర్రపు డెక్కను జెసిబి సాయంతో తొలగించేలా చర్యలు చేపట్టాం. ముంపు నీరు మరింత చేరి కొల్లేటి నీటిమట్టం పెరిగితే ప్రజలను అప్రమత్తం చేసేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆదేశించాం. ప్రజలు ఆందోళన చెందొద్దు. ఎలాంటి పరిస్థితులు తలెత్తినా తక్షణ సహాయం కోసం వెంటనే అధికారులకు తెలియజేయాలి.

అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి

ప్రజలు నదిలోకి వెళ్లొద్దు : కలెక్టర్ వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

భద్రాచలం వద్ద గోదావరి ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. గోదావరికి వరద ఉధృతి దృష్ట్యా ప్రజలెవ్వరూ నదిలోకి దిగొద్దని, ఈతకు వెళ్లడం, చేపలు పట్టడం వంటివి చేయొద్దని తెలిపారు. అత్యవసర సమయంలో వినియోగం నిమిత్తం మోటార్ బోట్లు, గత ఈతగాళ్లను సిద్ధంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు.

'స్త్రీ శక్తి'పై నిరాశ

ఉచిత బస్సు ప్రయాణంపై గందరగోళం

ప్రజాశక్తి - కుక్కునూరు

రాష్ట్ర విభజనతో ఆంధ్రప్రదేశ్‌లో విలీనమైన కుక్కునూరు, వేలేరుపాడు మండలాల మహిళలకు కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్త్రీ శక్తి పథకం (ఉచిత బస్సు ప్రయాణం) వర్తించకపోవడంతో నిరాశ, గందరగోళం నెలకొంది. ఈ రెండు మండలాలు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సరిహద్దుల్లో ఉండటంతో ఇక్కడి ఆర్‌టిసి సర్వీసులను అంతరాష్ట్ర (ఇంటర్ స్టేట్) సర్వీసులుగా గుర్తించడంతో స్త్రీ శక్తి పథకం వర్తించడం లేదని సమాచారం. దీంతో మహిళలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం ఆర్‌టిసి కాంప్లెక్స్‌లో ఉచిత బస్సు కోసం ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పల్లె వెలుగు బస్సుల్లో కూడా కొన్ని బస్సుల్లో మాత్రమే ఉచిత ప్రయాణమని, జీలుగుమిల్లి వరకు ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణించాలంటే అవకాశం లేదని మహిళలు చెబుతున్నారు. అర్థం కాక ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు.

బస్సు వద్ద మహిళలు

ఆక్వా రంగాన్ని కాపాడాలి

ట్రంప్ సుంకాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మౌనం వీడాలి

రౌండ్‌టేబుల్ సమావేశంలో సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్ నేతలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ట్రంప్ సుంకాలు తగ్గించుకోవాలని, ఆక్వా రంగాన్ని కాపాడాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మౌనం వీడాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, సిపిఐ జిల్లా సమితి కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య, కాంగ్రెస్ జిల్లా నాయకులు రాజనాల రామ్మోహనరావు డిమాండ్ చేశారు. ట్రంప్ సుంకాలు - ఆక్వా కుదేలు అంశంపై స్థానిక పవరుపేటలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశానికి ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ భారతదేశం నుంచి అమెరికాకు ఎగుమతి అవుతున్న వ్యవసాయ, ఆక్వా తదితర ఉత్పత్తులపై పన్నులు 50 శాతం పైగా వేయటంతో ఆక్వా పరిశ్రమ ఒక్కసారిగా కుదేలైందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆక్వా పరిశ్రమ సంక్షోభంలో పడి రైతులు దివాలాతీసే ప్రమాదం ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో మన దేశ ఆర్థిక వ్యవస్థ కూడా దిగజారిపోతుందని అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. దేశంలో పది లక్షల మంది ఆక్వా రైతులుంటే ఆంధ్రలోనే ఆరు లక్షలకు పైగా ఎకరాల్లో చేపలు, రొయ్యలు సాగు చేస్తున్న రైతులు 3.5 లక్షలుపైగా ఉన్నారని, రాష్ట్రం నుంచి రూ.వేల కోట్ల విలువైన రొయ్యలు ఎగుమతులు జరుగుతున్నాయని తెలిపారు. రూ.వేల కోట్లు విదేశీ మారకద్రవ్యం రూపంలో దేశానికి, రూ.వందల కోట్లు పన్నులు, మార్కెట్ సెస్‌ల రూపంలో రాష్ట్రానికి ఆదాయం వస్తోందని వివరించారు. ఇంతటి ముఖ్య రంగంపై అమెరికా అధ్యక్షుడు విధించిన 50 శాతం పన్ను (ఆచరణలో 59.65శాతం) వల్ల మన ఆక్వా రంగాన్ని, రైతులను కుదేలు చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. అమెరికా పన్నుల బూచిచూపి ట్రేడర్లు, కంపెనీలు ధర తగ్గించేసి కొంటున్నారని, రైతాంగం తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ట్రంప్ ఏ దేశంపైన విధించని పన్నులు మన దేశంపై విధిస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మౌనంగా ఉండటం మన చేతకాని తనాన్ని తెలియచేస్తుందన్నారు. ట్రంప్ ఇంత దుర్మార్గం చేస్తున్నా ప్రధానమంత్రి మోడీ మౌనంగా ఉండటం సిగ్గు చేటన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దీనిపై వెంటనే స్పందించి ఆక్వా రైతులను, ఆక్వా రంగంపై ఆధారపడి జీవిస్తున్న అనేక మంది కార్మికులను రక్షించేందుకు చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. కేవలం ఆక్వా రంగంపైనే కాకుండా దేశంలో వ్యవసాయ ఉత్పత్తులపై కూడా ట్రంప్ సుంకాల ప్రభావం పడుతోందన్నారు. ట్రంప్ మొండివైఖరికి చైనా తదితర దేశాలు ధీటుగా స్పందించినట్లుగా మన దేశ ప్రధానికి కూడా స్పందించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ఎంఫెడా కౌంటర్ గ్యారెంటీ ఇచ్చి ఆక్వా ఉత్పత్తులను గిట్టుబాటు ధరకు మొత్తం కొనుగోలు చేస్తానని భరోసా ఇవ్వాలని, కేంద్రం, ప్రధాని అమెరికాతో చర్చలు జరపాలని, ప్రత్యామ్నాయ మార్గాలను చేపట్టాలని, కేంద్ర ప్రభుత్వం అమెరికా ఆంక్షలు తిప్పి కొట్టాలని, అమెరికా సుంకాలకు వ్యతిరేకంగా ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో తీర్మానం చేసి, కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని, ఆక్వా రంగాన్ని వ్యవసాయంగా గుర్తించాలని, రైతులు, రైతు సంఘాల ప్రతినిధులతో సమస్యలపై చర్చించాలని, రాష్ట్ర ప్రభుత్వం కూడా గతంలోవలె కౌంటుల వారీగా ధరలు నిర్ణయించి ఎక్స్పోర్టర్లు, ట్రేడర్లతో అమలు చేయించాలని, మార్కెట్ జోక్యం పథకం (ఎంఐఎస్) ద్వారా సబ్సిడీ ధర ఇవ్వాలని, నాణ్యమైన సీడ్, ఫీడ్ అందేల చూడాలని, ధరలు నియంత్రించాలని, విద్యుత్ రాయితీ, పెండిరగ్ కనెక్షన్లు, ట్రాన్స్ ఫార్మర్లు ఇవ్వాలని, దేశంలో వినియోగం పెరిగేలా (డొమెస్టిక్) చర్యలు తీసుకోవాలని, మార్కెట్ యార్డుల్లో, సొసైటీల్లో శీతల గిడ్డంగులు నిర్మించి రైతాంగానికి అందుబాటులోకి తేవాలని, కేంద్రం ఎక్స్పెన్సీ నిధులు ఇచ్చి ఆక్వా ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.శ్రీనివాస్ తీర్మానాన్ని ప్రవేశపెట్టగా సభ్యులు ఆమోదం తెలిపారు. బికెఎంయు జిల్లా అధ్యక్షులు నాయకులు బండి వెంకటేశ్వరరావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ తదితరులు మాట్లాడారు. ముగింపు మాటలుగా సిపిఎం ఏలూరు నగర కార్యదర్శి పి.రవికుమార్ మాట్లాడారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగ రాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయ కులు పి.రామకృష్ణ, జిల్లా నాయకులు గుడిపాటి నరసింహారావు, ఎం.ఇస్సాక్, కాంగ్రెస్ నాయకులు డి.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రవి

వర్షం.. స్తంభించిన జనజీవనం

ప్రజాశక్తి - ముదినేపల్లి

అల్పపీడన ప్రభావంతో ముదినేపల్లి మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ఆదివారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు ఎడతెరిపి లేని వర్షం కురిసింది. ఎడతెరిపి లేని వర్షంతో పాదచారులు, ద్విచక్ర చక్రవాహనదారులు తీవ్ర అవస్థలు పడ్డారు. ముదినేపల్లి ప్రధాన సెంటర్‌లో జాతీయ రహదారి విస్తరణ పనులు జరుగుతుండడంతో వర్షానికి రహదారి అంతా చిత్తడి, చిత్తడిగా మారింది. వర్షానికి బేరాలు లేక చిరు వ్యాపారులు ఇబ్బంది పడ్డారు. దీనికి తోడు గుడివాడ సమీపంలో రైల్వే గేట్ మూసివేతతో వాహనాలు ఈ రూట్లో బంద్ అయ్యాయి. రోడ్డు విస్తరణ పనుల కారణంగా ముదినేపల్లి బస్ స్టేషన్‌లోకి బస్సులు రావడం లేదు. దీంతో వాహనాలన్నీ గురజ సెంటర్ మీదుగా ఇతర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తున్నాయి. వర్షంతో రాకతో ప్రయాణికులు నిలువ నీడ లేక నడి రోడ్డుపైనే బస్సుల కోసం వేచి ఉండాల్సింది దుస్థితి ఏర్పడింది. దీంతో వర్షానికి తడుస్తూ ప్రయాణికులు బస్సుల రాక కోసం రోడ్డుపైన నిలబడి వేచి చూస్తున్నారు. వర్షానికి పల్లపు ప్రాంతాల్లోని కాలనీలోకి నీరు చేరి ప్రజలు అసౌకర్యానికి లోనయ్యారు. ముదినేపల్లి శివారు అన్నవరం జగనన్న కాలనీలో వర్షపు నీరు ఇళ్ల చుట్టూ భారీగా చేరింది. దీంతో కాలనీవాసులు వర్షపు నీటిలో నడుచుకుంటూ రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి నెలకొంది. ఇళ్ల చుట్టూ, పరిసర ప్రాంతాల్లో వర్షపు నీరు చేరడంతో కాలనీవాసులు తీవ్ర అసౌకర్యానికి లోనవుతున్నారు. ముదినేపల్లి అంబేద్కర్ నగర్ కాలనీలోనికి నీరు చేరడంతో ఇళ్లలోని వస్తు సామగ్రి తడిచిపోవడంతో పలువురు వేరే ప్రాంతాలకు తరలి వెళ్లారు. ఎడతెరిపి లేని వర్షంతో జనజీవనం స్తంభించింది.

ముదినేపల్లి : నిలిచిన వర్షపు నీరు

ఏలూరు సిటీ : ఏలూరు నగరంలో ఆదివారం ఉదయం నుంచి వర్షం కురుస్తూనే ఉండడంతో జనజీవనం స్తంభించిపోయింది. వర్షం కారణంగా రహదారులపై గుంతలు నీటితో నిండిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మార్కెట్ ప్రాంతాలు వర్షపు నీటితో బురద చెరువుల్లా మారి వ్యాపారులకు అంతరాయం కలిగింది. అదేవిధంగా ఆదివారం ఏలూరు నగరంలో నిర్వహించే సండే మార్కెట్‌కు వచ్చే జన తీవ్రత తగ్గిపోయింది. వారం మొత్తం ఎదురు చూసి సండే మార్కెట్లో వ్యాపారం చేసుకునే చిరు వ్యాపారులు కొనేవారు లేక లబోదిబోమంటూ బాధతో వ్యాపారాలను మూసివేశారు. ఆదివారం సెలవు దినం కావడంతో పాఠశాలలకు, ఉద్యోగస్తులకు కొంత ఊరట లభించింది.

పోలవరం : అల్పపీడన ప్రభావంతో గత మూడు రోజులుగా పోలవరంలో నిరంతరాయంగా వర్షం కురుస్తూనే ఉంది. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఎడతెరిపి లేకుండా చినుకులు పడుతూనే ఉండటంతో మండల కేంద్రంలో ప్రధాన రహదారిలో, వీధుల్లో జనజీవనం స్తంభించింది. శుక్రవారం 24.4 మిల్లీమీటర్లు, శనివారం 45.0 మిలిమీటర్లు, ఆదివారం సాయంత్రానికి 3.6 మిల్లీమీటర్లు నమోదైనట్లు ఎఎస్ఒ వినవత తెలిపారు.

కెమికల్ ట్యాంకర్ బోల్తా

లీకవుతున్న కెమికల్

ప్రమాదం జరగకుండా పోలీసుల పహారా

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

కెమికల్‌తో వెళ్తున్న ట్యాంకర్ లారీ జీలుగుమిల్లి మండలంలోని రమణక్కపేట సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం సాయంత్రం అదుపుతప్ప బోల్తా పడింది. మెడికల్స్‌లో ఉపయోగించే కెమికల్ (మిథైల్ టెర్టియరీ బుటైల్ ఈథర్)తో హైదరాబాద్ నుంచి విశాఖపట్నం వెళ్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. అదుపుతప్పి లారీ బోల్తా పడి రోడ్డు పక్కన తుప్పల్లోకి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో డ్రైవర్, క్లీనర్ స్వల్ప గాయాలపాలయ్యారు. కెమికల్ ట్యాంకర్‌కు రంధ్రం పడింది. కెమికల్ లీకవుతుంది. దీంతో ఏదైనా ప్రమాదం జరిగే అవకాశాలు ఉండడంతో స్థానికులు భయభ్రాంతులకు గురవుతున్నారు. విషయం తెలుసుకున్న సిఐ వెంకటేశ్వరావు, ఎస్ఐ క్రాంతికుమార్ ఘటనా స్థలానికి చేరుకుని ట్యాంకర్‌ను బయటకు తీసే ఏర్పాట్లు చేస్తున్నారు. కెమికల్ లీకవుతుండటంతో ఎటువంటి ప్రమాదం జరగకుండా పోలీసులు పహారా కాస్తున్నారు.

ఐక్య పోరాటాలతో సమస్యలు పరిష్కారం

ఐద్వా జిల్లా అధ్యక్షురాలు హేమ

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మహిళలు ఐక్యంగా పోరాడితే సమస్యలు పరిష్కారమవుతాయని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు హేమ అన్నారు. పట్టణంలోని సుందరయ్య భవనంలో అఖిల భారత ప్రజాతంత్ర అఖిల మహిళా సమాఖ్య (ఐద్వా) ఏడో పట్టణ మహాసభ ఆదివారం నిర్వహించారు. సభకి నండూరి పద్మాంజలి అధ్యక్షత వహించగా ముఖ్య వక్తలుగా రిటైర్డ్ కమర్షియల్ ట్యాక్స్ అధికారి బత్తుల బాల కోటేశ్వరి, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు హేమ, పుట్టి కమల కార్యదర్శి నివేదిక సమర్పణ చేశారు. అనంతరం తొమ్మిది మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. పట్టణ కార్యదర్శిగా నండూరి పద్మాంజలి, అధ్యక్షురాలిగా ఈదర సుజాత, కోశాధికారిగా మద్దాలి లక్ష్మి, గౌరవాధ్యక్షురాలిగా పుట్టి కమల, కమిటీ సభ్యులుగా బొబ్బిలి కుమారి, కంబాల నాగమణి, షేక్ జైనభి, వై.శ్రీలలిత, సుంకర కృష్ణవేణి, దళాయి దుర్గాభవాని ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షురాలు హేమ మాట్లాడుతూ ఈ మధ్య కాలంలో మైక్రో ఫైనాన్స్ సమస్యలు, మెజారిటీ భర్తలు ఆదాయం ఇంటికి ఇవ్వకుండా బెట్టింగులు, మద్యం వ్యసనాలకు ఖర్చు పెడుతున్నారని, తద్వారా ఆయా కుటుంబాల మహిళలకు ఇంటి పనితో పాటు ఇంటి నిర్వహణ బాధ్యతలో అదనపు భారం పడుతుందని వాపోయారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుకు వెళ్లేందుకు ప్రయత్నిస్తుంటే మారుతున్న కాలాన్ని మళ్లీ వెనక్కి తీసుకుపోవాలని పాలకులు చూస్తున్నారని వాపోయారు. లౌకిక స్వామ్యాన్ని రాజ్యాంగం నుంచి తొలగించి ప్రజల మాట్లాడే స్వేచ్ఛలకు విఘాతం కలిగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి ధోరణులను మహిళలు ఐక్యంగా ఐద్వా వంటి ప్రజాస్వామ్య సంఘంతో కలిసి పోరాడాలని పిలుపు నిచ్చారు.

మాట్లాడుతున్న ఐద్వా జిల్లా నేత హేమ


వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు

విద్యార్థినులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - ముసునూరు

గురుకుల బాలికల పాఠశాలలో 480 మంది విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు ప్రిన్సిపల్ ఠి.లక్ష్మీకుమారి తెలిపారు. మండల కేంద్రమైన ముసునూరు గురుకుల బాలికల పాఠశాలలో చదివిన విద్యార్థులు వైద్యులు అయ్యారు. ఆగురుగు వైద్యులు పాఠశాలలో విద్యార్థినులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించారు. వైద్యులు శారద, కవిత, భాగ్యలక్ష్మి, సుధ, శాంతికిరణ్, ధనలక్ష్మి కలిసి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థినులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించారు. పాఠశాల విద్యార్థినులకు వైద్య సేవలు అందించడానికి తరచూ పాఠశాలకు వస్తామని తెలిపారు. విద్యార్థి దశలో తీసుకోవాల్సిన ఆహార నియమాలు, పరిశుభ్రత గురించి వివరించారు. విటమిన్ లోపం లేకుండా పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. పాఠశాలలో మందులు నిల్వ చేసుకోవడానికి ఫ్రిజ్, ఆట వస్తువులు ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ లక్ష్మీకుమారి మాట్లాడుతూ పూర్వ విద్యార్థినులు సేవలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైద్య బృందాన్ని ప్రిన్సిపల్ లక్ష్మీకుమారి, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

ఆసుపత్రి ఆవరణ శుభ్రం చేస్తున్న విద్యార్థులు

ప్రభుత్వాసుపత్రిలో 'స్వచ్ఛ ఏలూరు'

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరు సత్రంపాడులోని ఆదిత్య డిగ్రీ కళాశాల, నేషనల్ సర్వీస్ స్కీమ్, రెడ్‌క్రాస్, మానవతా సంస్థ వారి ఆధ్వర్యంలో స్వచ్ఛఏలూరు కార్యక్రమాన్ని ఆర్‌ఆర్.పేటలోని గవర్నమెంట్ హాస్పిటల్ పరిసరాల్లో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ పరిసరాల్లో ఉన్న ప్లాస్టిక్, చెత్తను, కలుపు మొక్కలను తీసివేసి హాస్పిటల్ పరిసర ప్రాంతాలను పరిశుభ్రం చేసుకున్నట్లు ఆదిత్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ వంగా వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డి.వి.ఐ.జేబీకుమార్, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ కె.హరిబాబు, ఎ. సిహెచ్.కృష్ణ, రెడ్ క్రాస్ మానవతా సంస్థల సభ్యులు ఆలపాటి నాగేశ్వరరావు, నిర్మల, విద్యార్థులు వాలంటీర్లు పాల్గొన్నారు.


పిచ్చమ్మ పార్థివదేహానికి అంజలి ఘటిస్తున్న మాజీ ఎంఎల్‌ఏ డివిఆర్

ఇంటేటి పిచ్చమ్మ అంత్యక్రియలు పూర్తి

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లి గ్రామ సర్పంచి నిమ్మగడ్డ కైకమ్మ మాతృమూర్తి ఇంటేటి పిచ్చమ్మ అంత్యక్రియలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కైకలూరు మాజీ ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు పిచ్చమ్మ పార్థివదేహాన్ని సందర్శించి అంజలి ఘటించి కుటుంబ సభ్యులకు సంతాపం వ్యక్తం చేశారు. ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ, జెడ్‌పిటిసి సభ్యులు ఈడే వెంకటేశ్వరమ్మ, వైస్ ఎంపిపి రాయపాటి రాధా, సిహెచ్.సునీత, వైసిపి రాష్ట్ర ముదిరాజ్ సంఘ అధ్యక్షులు కోమటి విష్ణువర్ధన్, స్పామ్ ఐటిఐ ప్రిన్సిపల్ కె.సత్యనారాయణ, ఈడే చిన్నా, జిల్లా అధికార ప్రతినిధి మొట్టూరు ఏసుబాబు, జిల్లా బిసి విభాగ ఉపాధ్యక్షులు బత్తిన కిషోర్, పార్టీ కైకలూరు మండలాధ్యక్షులు సింగంశెట్టి రాంబాబు, కైకలూరు టౌన్ పార్టీ అధ్యక్షులు నమయం రామాంజనేయులు, నియోజకవర్గ వాణిజ్య విభాగ అధ్యక్షులు రాచూరి కుమార్, సాక్షి సాయి, మీసాల రామకృష్ణ, ఈడే ఉమ, మన్నెం రవికిరణ్, పాతూరి ఆంజనేయులు తదితరులు కుటుంబ సభ్యులను పరామర్శించిన వారిలో ఉన్నారు.

అలుముకున్న నిర్లక్ష్యం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

జంగారెడ్డిగూడెం పట్టణంలో ధారావారి వీధిలో రాజా హాస్పిటల్ వద్ద విద్యుత్ స్తంభం చుట్టూ పాదు పేరుకుపోయింది. విద్యుత్ స్తంభం వెలుగుతున్నా వెలుతురు రాకపోవడంతో రాత్రి సమయంలో దారి కనిపించక స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి పేరుకుపోయిన పాదును తొలగించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

విద్యుత్ స్తంభాన్ని అల్లుకున్న పాదు

నేరాలు - ఘోరాలు

లారీ ఢీకొని డ్రైవర్, క్లీనర్ మృతి

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

లారీని పక్కకు నిలిపి డ్రైవర్, క్లీనర్ కొబ్బరిబొండాల లోడును సరిచేస్తుండగా మరో లారీ ఢీకొట్టడంతో వారిద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. ఇద్దరి మృతదేహాలు నుజ్జునుజ్జు అయి గుర్తు పట్టలేని విధంగా మారాయి. ఈ ఘటన కొయ్యలగూడెం-జంగారెడ్డిగూడెం జాతీయ ప్రధాన రహదారిపై ఆదివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాలకొల్లు నుంచి తెలంగాణ రాష్ట్రానికి కొబ్బరిబొండాల లోడుతో లారీ బయలుదేరింది. ఈ క్రమంలో లారీ ఆదివారం తెల్లవారుజామున 2.30 గంటల సమయంలో పవర్ గ్రిడ్ వద్దకు వచ్చేసరికి లోడు ఒక వైపునకు ఒరిగింది. దీంతో లారీని రోడ్డు మార్జిన్ వైపున నిలిపి డ్రైవర్ నుజ్జయి రాజేష్ (30), క్లీనర్ తొడదాసి లక్ష్మణరావు (35) లోడును సరి చేస్తున్నారు. కలకత్తా నుంచి హైదరాబాదు వెళ్తున్న లారీ మితిమీరిన వేగంతో వచ్చి ఇరువురిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్, క్లీనర్ అక్కడికక్కడే మృతి చెందారు. ఇరువురి మృతదేహాలు నుజ్జునుజ్జు అయి గుర్తు పట్టలేని విధంగా మారాయి. మృతుల బంధువుల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వి.చంద్రశేఖర్ తెలిపారు.

విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి

ప్రజాశక్తి - టి.నరసాపురం

విద్యుదాఘాతానికి గురై పాడి గేదె మృతి చెందిన సంఘటన మండల కేంద్రమైన టి.నరసాపురం పంచాయతీ కొలిగింగం గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కొరివి ప్రసాద్ తనకున్న పాడిగేదెను మేత కోసం పొలంలోని జాడు గడ్డిలోకి తోలాడు. అప్పటికే కొబ్బరి మట్టపై పడి తెగిపడ్డ విద్యుత్ వైరుకు తగిలి గేదె విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. పాడి గేదె విలువ సుమారు రూ.1.20 ఉంటుందని స్థానికులు తెలిపారు.

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

ప్రజలు బలయ్యేవరకూ పట్టించుకోరా..!

ప్రమాదకరంగా రహదారి విస్తరణ పనులు
అధికారులు స్పందించాలని వేడుకోలు

విరిగిపోయిన డ్రెయినేజీపై ఏర్పాటు చేసిన సిమెంట్ ప్లేట్లు

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లి ప్రధాన సెంటర్లో జరుగుతున్న రహదారి విస్తరణ పనులు అత్యంత ప్రమాదకరంగా మారాయి. పనులు చేసే కాంట్రాక్టర్ అడ్డగోలుగా, అడ్డదిడ్డంగా, ఇష్టారాజ్యంగా పనులు చేపట్టడంతో ప్రజలు, వాహనదారులు, వ్యాపారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. కాంట్రాక్టర్ చేసే పనుల్లో నాణ్యత లేదని, నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికారులు కూడా సరిగ్గా పనులను పర్యవేక్షణ చేయకపోవడంతో సదరు కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా పనులు చేస్తున్నట్లు ప్రజల నుంచి ఆరోపణలు వినిపిస్తున్నాయి. పనులు జరిగే ప్రాంతాల్లో సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో గత నెలలో విశ్రాంతి శాస్త్రవేత్త చందు వెంకటేశ్వరరావు కారు మురుగు కాలవలో బోల్తా పడిన ఘటనలో శాస్త్రవేత్త మృతి చెందిన విషయం తెలిసిందే. ప్రమాదం జరిగిన ప్రాంతంలో మూటలు పెట్టి చేతులు దులుపుకున్నారే తప్ప ఎలాంటి భద్రత చర్యలు తీసుకోలేదని ప్రజల నుంచి ఆరోపణను వస్తున్నాయి. అలాగే పంచాయతీ కార్యాలయం రోడ్డులో విస్తరణ పనులు అధ్వానంగా జరుగుతున్నాయి. సదరు కాంట్రాక్టర్ డ్రెయినేజీ నిర్మాణం చేపట్టి పలుచోట్ల అసంపూర్తిగా వదిలి వేయడంతో ప్రమాదాలు జరుగుతున్నట్లు ప్రజలు చెబుతున్నారు. డ్రెయినేజీలపై ఏర్పాటు చేసిన సిమెంట్ మూతలు ఇప్పటికే పలు చోట్ల ధ్వంసమయ్యాయి. ప్రజలు ఏమాత్రం ఏమరపాటుగా ఉన్న డ్రెయినేజీల్లో పడి మృతి చెందే అవకాశం ఉంది. డ్రెయినేజీలపై ఏర్పాటు చేసిన ప్లేట్లు విరిగిపోయి ప్రమాదకరంగా మారాయి. దీనిని బట్టి చూస్తే కాంట్రాక్టర్ చేసే పనులు నాణ్యతా ప్రమాణాలు ఏ విధంగా ఉన్నాయో ఇట్టే అర్థమవుతుంది. సెంటర్లో దుకాణాల ముందు డ్రెయినేజీలపై ఏర్పాటు చేసిన సిమెంట్ ప్లేట్లు పలుచోట్ల ముక్కలుగా విరిగిపోయాయి. రాత్రి సమయాల్లో దుకాణానికి వచ్చి ప్రజలకు కనిపించక డ్రెయినేజీలో పడి క్షతగాత్రులుగా మారుతున్నారు. ఇప్పటికైనా నేషనల్ హైవే ఉన్నతాధికారులు, స్పందించి ముదినేపల్లి సెంటర్లో జరుగుతున్న రోడ్డు విస్తరణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించేలా చూడాలని ముదినేపల్లి వాసులు కోరుతున్నారు.

ఎన్‌హెచ్ అధికారుల్లో కదలిక

జెసి ఆదేశాలతో ప్రమాద హెచ్చరికల బోర్డులు ఏర్పాటు

ఏర్పాటు చేసిన సూచిక బోర్డు

ప్రజాశక్తి - మండవల్లి

అస్తవ్యస్తంగా మారిన జాతీయ రహదారి 165 అభివృద్ధి పనులతో వాహనదారులు, ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కనీసం ప్రమాద హెచ్చరిక బోర్డులను కూడా ఏర్పాటు చేయకపోవడంతో సుమారు తొమ్మిది మంది మృత్యువాత పడగా ఎంతోమంది వాహనదారులు గాయాలపాలైన సంఘటనలు చోటుచేసుకున్నాయి. వీటిపై ప్రజాశక్తిలో కథనాలు ప్రచురితమయ్యాయి. అంతేకాకుండా సూచిక బోర్డులను కూడా ఏర్పాటు చేయకపోవడంపై సంభవించిన మరణాలపై ఈ నెల రెండో తేదీన ఆ పనులు మృత్యు పాశాలు అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై జిల్లా జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి స్పందించారు. మండవల్లి, ముదినేపల్లి, కైకలూరు మండలాల్లో ఎన్‌హెచ్, రెవెన్యూ అధికారులు కలిసి జాతీయ రహదారిపై నిర్వహిస్తున్న పనులను ఆకస్మిక తనిఖీ చేసి పరిశీలించారు. ప్రమాదాలకు నిలయంగా ఉన్న ప్రాంతాలను, హెచ్చరిక బోర్డులు లేకపోవడం వల్ల వాహనదారులు మృతి చెందిన ప్రదేశాలను ఆమె క్షుణంగా పరిశీలించారు. జాతీయ రహదారిపై జరుగుతున్న అభివృద్ధి వల్ల ప్రజలు వాహనదారులు పడుతున్న ఇబ్బందులను ప్రజలు ఆమె దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆమె పనులు నిర్వహించే ప్రాంతాల్లో ప్రమాద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయకపోవడం జాతీయ రహదారిపై పనులు నిర్వహిస్తున్నట్లు ఎక్కడ కనిపించకపోవడం ప్రమాదాలకు నిలయంగా మారిన జాతీయ రహదారి పనులపై ఆమె ఒక్కింత అసహనానికి గురై అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. యుద్ధ ప్రాతిపదికన పనులు ప్రారంభించి పూర్తి చేయకపోతే చర్యలు తప్పవని హెచ్చరించడంతో పాటు పనులు నిర్వహించే ప్రాంతాల్లో ప్రమాదాలను నివారించేలా సూచిక బోర్డులను వెంటనే ఏర్పాటు చేయాలని అధికారులకు ఆమె ఆదేశించారు. దీంతో ఎన్‌హెచ్ అధికారులు ప్రమాద హెచ్చరిక బోర్డులను మలుపు ప్రాంతాలను తెలిపే విధంగా ఏర్పాటు చేశారు. జాతీయ రహదారి అభివృద్ధి పనుల నేపథ్యంలో జరుగుతున్న ప్రమాదాలపై అధికారులు స్పందించి ప్రమాదాలను నివారించే విధంగా చర్యలు చేపట్టేలా కథనాలను రాసి అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన ప్రజాశక్తిని ఈ సందర్భంగా వాహనదారులు, ప్రజలు అభినందనలు తెలిపారు.

20న జాబ్‌మేళా

ప్రజాశక్తి - ఏలూరు

రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో చింతలపూడి ఎంఎల్‌ఎ సొంగా రోషన్ కుమార్ ఆధ్వర్యంలో జంగారెడ్డిగూడెం టౌన్ హాలులో ఈ నెల 20వ తేదీ బుధవారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎన్.జితేంద్రబాబు ఆదివారం తెలిపారు. ఈ జాబ్ ఫెయిర్‌లో 13 కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని, సుమారు 877 మంది నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారని తెలిపారు. ఈ జాబ్ మేళాకు పదో తరగతి, ఇంటర్, ఐటిఐ, డిగ్రీ, పీజీ వంటి విద్యార్హతలు ఉండి 18 నుంచి 30 సంవత్సరాల వయసు గల వారు అర్హులని తెలిపారు. వివరాలకు 9666322032, 9652503799, 9642598324, 9988853335, 8712655686, 8790118349, 8790117279 సంప్రదించాలని తెలిపారు. ఈ జాబ్ మేళాకు హాజరయ్యే అభ్యర్థులు తమ బయడేటా, సర్టిఫికెట్స్, జిరాక్స్‌లతో 20వ తేదీ ఉదయం తొమ్మిది గంటలకు హాజరు కావాలని తెలిపారు.

మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని దర్భగూడెం సచివాలయ ఆవరణలో ఆదివారం హోప్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో సర్పంచి సున్నం ఉషారాణి చేతుల మీదుగా గ్రామానికి చెందిన మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేసినట్లు టిడిపి గ్రామ అధ్యక్షులు తమ్మన సాంబ తెలిపారు. 60 శాతం రాయితీతో గ్రామానికి చెందిన 40 మంది మహిళలకు ఈ మిషన్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచి సున్నం ఉషారాణి మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదగడానికి ఈ కుట్టుమిషన్లు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో దర్భగూడెం సొసైటీ అధ్యక్షులు అక్కిశెట్టి విజయ్ ప్రసాద్, హోప్ మినిస్ట్రీస్ ఆర్గనైజర్ బాలాజీ, జి.మణికుమార్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు ఆదర్శనీయం

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

పద్మభూషణ్ డాక్టర్ మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు వారోత్సవాలు ఏలూరు చిరంజీవి యువత ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. సేవా స్ఫూర్తిని ప్రేరణగా తీసుకున్న మెగా అభిమానులు వారం రోజులపాటు వేర్వేరు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలోనే ఆదివారం 46వ డివిజన్ ఆదివారంలో ఏలూరు చిరంజీవి యువత అధ్యక్షులు శానం శ్రీరామకృష్ణమూర్తి పర్యవేక్షణలో మెగా రక్తదాన శిబిరం, ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎపిఎస్ ఆర్‌టిసి విజయవాడ జోనల్ ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు హాజరై రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. సుమారు 50 మందికి పైగా మెగా అభిమానులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా రెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ మెగాస్టార్ సేవా గుణాన్ని స్ఫూర్తిగా తీసుకుని అభిమానులు చేస్తున్న ఈ సేవా కార్యక్రమాలు అందరికీ ఆదర్శనీయమన్నారు. ఉచిత మెడికల్ క్యాంపు, రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసిన చిరంజీవి యువతను ప్రత్యేకంగా అభినందించారు. చిరంజీవికి ముందస్తుగా పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఆగస్టు 22 వరకు ప్రతిరోజు ఒక వినూత్నమైన సేవా కార్యక్రమాన్ని చేపట్టాలన్న ఆలోచనతో అభిమానులు ముందుకు రావడం సమాజానికి ఆదర్శమన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని అభిమానులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో చిరంజీవి యువత అధ్యక్షులు శానం శ్రీరామకృష్ణమూర్తి, పి.జగన్, సురేష్ మాస్టర్, ఇ.పవన్, దేవరపల్లి పెదబాబు, కట్టా ఆది, నరేష్, పండు నాయుడు, తుంపాల ఫణి, కోమాకుల శ్రీను, కరణం లోకేష్, లొట్టు రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్

ప్రజాశక్తి - దెందులూరు

ప్రజా సమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యంగా పాలన కొనసాగిస్తున్నామని దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ తెలిపారు. దుగ్గిరాలలోని క్యాంపు కార్యాలయంలో పలువురు నియోజకవర్గ కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్‌ను ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులు స్వీకరించిన ఎంఎల్‌ఎ సత్వరమే వాటిని పరిష్కరించేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యవర్గం ఎన్నిక

అధ్యక్ష కార్యదర్శులుగా పి.భారత, టి.మాణిక్యం

పి.భారతి

టి.మాణిక్యం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు జిల్లా నూతన అధ్యక్షులుగా పి.భారతి, కార్యదర్శిగా టి.మాణిక్యం ఎన్నికయ్యారు. జంగారెడ్డిగూడెంలో శనివారం నిర్వహించిన యూనియన్ 9వ జిల్లా మహాసభలో నూతన కమిటీ ఎన్నికైంది. ఆ వివరాలను యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులుగా ఎన్నికైన డిఎన్‌విడి.ప్రసాద్ ఆదివారం ఏలూరులో మీడియాకు విడుదల చేశారు. కోశాధికారిగా ఎం.తులసి, ఉపాధ్యక్షులుగా పి.సుజాత, టి.రజిని, పి.రాజకుమారి, బిజెఎన్.కుమారి, జి.విమల, వి.స్వర్ణకుమారి, భార్గవి, చెల్లెమ్మ ఎన్నికయ్యారు. సహాయ కార్యదర్శులుగా కె.పుష్ప, ఎస్.లత, జి.సరళ, షమీమా, సిహెచ్.ఇందిర (మినీ), మహిమ (హెల్పర్), వెన్నెల (హెల్పర్) ఎన్నికయ్యారు. మహాసభల్లో అంగన్వాడీలకు చంద్రబాబు ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మారుస్తూ వెంటనే జిఒ జారీ చేయాలని, సెంటర్ అద్దెల బకాయిలు, కరెంట్ ఛార్జీలు వెంటనే చెల్లించాలని, ఎఫ్ఆర్ఎస్, యాప్స్ పేరుతో వేధింపులు ఆపాలని, స్కీం వర్కర్లకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరుతూ తీర్మానించారు. సమస్యల పరిష్కారానికి ప్రాణాలను కాలంలో పెద్ద ఎత్తున పోరాటం నిర్వహించాలని మహాసభలో నిర్ణయించారు.

నిరుపేదలకు అండగా సిఎం సహాయ నిధి

రాష్ట్ర గృహ నిర్మాణ, సమచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి

చెక్కులు అందిస్తున్న మంత్రి పార్థసారధి

ప్రజాశక్తి - ముసునూరు

నిరుపేదల మెరుగైన వైద్యం కోసం ప్రభుత్వం రూ.వేల కోట్లు కేటాయించిందని, అపత్కాలంలో ఉన్న నిరుపేదలకు సిఎం సహాయ నిధి అండగా నిలుస్తుందని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి అన్నారు. ముసునూరు మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో బాధిత కుటుంబాలకు సిఎం సహాయ నిధి చెక్కులను ఆయన అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వాసుపత్రుల్లో మెరుగైన వైద్య పరికరాలు అందుబాటులో ఉన్నాయన్నారు. పోలవరం ప్రాజెక్టు త్వరితగతిన పూర్తి చేస్తామని, చింతలపూడి ఎత్తిపోతల పథకం త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షులు గద్దె రఘుబాబు, సర్పంచి కొండేటి విజయలక్ష్మి, ఉప సర్పంచి తోట శ్రీనివాసరావు, నియోజకవర్గ తెలుగు యువత కార్యదర్శి కొండేటి బాబి, బిసి సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ నక్క యోహాన్, సొసైటీ ఛైర్మన్ దేవినేని శ్రీధర్, మండల మాజీ అధ్యక్షులు దేవినేని డలరామ్, మండల ప్రధాన కార్యదర్శి పి.సీతారాం, పార్టీ గ్రామ అధ్యక్షులు గార్లపాటి నరసింహారావు, టిడిపి నాయకులు టి.రంగారావు, గద్దల మోహనరావు, సూర్యదేవర శ్రీనివాసరావు, కొల్లి గంగారం, మెదరమెట్ల సురేంద్ర, మల్లిబాబు, తదితరులు పాల్గొన్నారు.

రమణక్కపేట సొసైటీ త్రిసభ్య కమిటీ ప్రమాణస్వీకారం

ప్రమాణస్వీకారం చేసిన సొసైటీ త్రిసభ్య కమిటీ

ప్రజాశక్తి - ముసునూరు

రైతులకు సేవలందించే భాగ్యం తమకు దక్కటం చాలా ఆనందదాయకమని రమణక్కపేట సొసైటీ ఛైర్మన్ రంగు ఆంజనేయులు అన్నారు. మండలంలోని రమణక్కపేట ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం సొసైటీ త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. సొసైటీ ఛైర్మన్‌గా రంగు ఆంజనేయులు, పర్సన్లుగా పాశం వెంకటేశ్వరరావు, ముళ్లపూడి మల్లేశ్వరిలను సొసైటీ కార్యదర్శి ప్రసాద్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు రుణ మంజూరు కార్యక్రమంలో ఎటువంటి ఇబ్బందీ లేకుండా పనిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండలాధ్యక్షులు గద్దె రఘుబాబు, టిడిపి మండల నాయకులు రంగు వాసు మల్లిబాబు, జనసేన నాయకులు పాశం నాగబాబు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అసెస్‌మెంట్ బుక్లెట్ విధానం ఉపసంహరించుకోవాలి

ఎపిటిఎఫ్ జిల్లా కార్యదర్శి బేతళ రాజేంద్రప్రసాద్

ప్రజాశక్తి- ముదినేపల్లి

అసెస్‌మెంట్ బుక్లెట్ విధానాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని ఎపిటిఎఫ్ జిల్లా కార్యదర్శి బేతళ రాజేంద్రప్రసాద్ కోరారు. ఆదివారం ఆయన ముదినేపల్లిలో విలేకర్లతో మాట్లాడారు. పరీక్షల నిర్వహణలో మూల్యాంకన పుస్తకాలు విద్యార్థులకు సరఫరా చేయడం అనే కొత్త విధానం అనేక కొత్త సమస్యలకు దారితీస్తుందని, ఈ విధానాన్ని వెంటనే ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని కోరారు. ఈ విధానం పాఠశాల పనివేళలో జరగాల్సిన బోధనా సమయాన్ని హరించే విధంగా ఉందన్నారు. గతంలో పరీక్ష పేపర్లు ఇంటి వద్ద దిద్దే పద్ధతికి బదులు పాఠశాలలో పుస్తకాలను ఇంటికి తీసుకొని వెళ్లలేని స్థితి ఏర్పడిందనన్నారు. వందలాది పుస్తకాలను మోసుకుని వెళ్లలేని పరిస్థితి ఏర్పడుతోందన్నారు. దీంతో పాఠశాలలో మూల్యాంకనం చేయాల్సిన పరిస్థితి ఏర్పడి బోధనా గంటలకు అంతరాయం ఏర్పడుతోందన్నారు. మార్కుల నమోదు కూడా ఉపాధ్యాయులకు పనిభారంగా పరిణమించిందని, ఇప్పటికే ఆన్‌లైన్ నమోదు, రిజిష్టర్ నమోదులతో పాటుగా ఇప్పుడు బబ్లింగ్ చేసే పనికూడా ఉపాధ్యాయులకు సంక్రమించిందన్నారు. ఆన్‌లైన్ విధానంలో నమోదుకు మాత్రమే పరిమితమై మిగిలిన నమోదుల నుంచి వెసులుబాటు ఇవ్వాలని కోరారు. ఈ కొత్త విధానం వల్ల మంచి ఫలితాలు రావు సరికదా, నష్టదాయకంగా మారకముందే ఈ విధానం నుంచి వైదొలగాలని ప్రభుత్వాన్ని బేతాళ రాజేంద్ర ప్రసాద్ కోరారు.

కార్మికుల హక్కుల కోసం పోరాడిన నరసింహారావు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

కార్మిక నాయకుడు కొఠారి నరసింహారావు 26వ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని ముఠా యూనియన్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. నరసింహారావు విగ్రహానికి ఎఐటియుసి స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ చలసాని వెంకట రామారావు పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎఐటియుసి స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ రామారావు మాట్లాడుతూ నూజివీడు ప్రాంతంలో ముఠా, హమాలీ కార్మికులకు సంఘటితపరచి వారి హక్కుల కోసం చివరి వరకు పోరాటం చేశారన్నారు. ఈ ప్రాంతంలో ముఠా కార్మికుల యజమానుల మధ్య రేట్లు ఒప్పందాలు చేసి కార్మికులను ఐక్యంగా ఉంచారన్నారు. ఈ ప్రాంతంలోనే కాకుండా విజయవాడ, గుడివాడ, మచిలీపట్నం, కైకలూరు ముఠా కార్మికుల కోసం అనేక ప్రజా ఉద్యమాలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి నియోజకవర్గ కార్యదర్శి సిహెచ్.పుల్లారావు, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి ఎన్.నరసింహ, సిపిఐ టౌన్ నాయకులు జి.సుబ్బారావు, ముఠా యూనియన్ నాయకులు కొలిపిరి కృష్ణ, కోలా రామ్మూర్తి, పి.క్రాంతి, రాంబాబు, సోమి నాయుడు, శ్రీనివాసరావు, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

కొల్లేరు ప్రజల సంక్షేమం కోసం కూటమి కృషి

దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని

ప్రజాశక్తి - మండవల్లి

కొల్లేరు సరస్సు అభివృద్ధి, కొల్లేరు ప్రాంత ప్రజల సంక్షేమం టిడిపి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ స్పష్టం చేశారు. మండలంలోని పెనుమాకలంకలో ఆదివారం నిర్వహించిన గంగానమ్మ జాతరకు ఆయన పడవపై వెళ్లి జాతరలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొల్లేటి ప్రాంత ప్రజలకు ఎన్‌డిఎ ప్రభుత్వంలో తప్పక మేలు జరుగుతుందన్నారు. కొల్లేటి ప్రాంత ప్రజలు పడుతున్న ఇబ్బందులు తలెత్తుతున్న సమస్యలపై సిఎం చంద్రబాబు నాయుడుకు స్పష్టమైన ఆలోచన ఉందన్నారు. గ్రామ సర్పంచి ముంగర నాగరాజుతో పాటు గ్రామస్తులు చింతమనేని ప్రభాకర్‌కు ఘన స్వాగతాన్ని పలికారు.

నిబంధన లేకుండా యూరియా అందించాలి

ప్రజాశక్తి - ముసునూరు

రైతులకు యూరియా ఎలాంటి నిబంధన లేకుండా అందించాలని నూజివీడు వ్యవసాయ సహాయ సంచాలకులు జి.విద్యాసాగర్ చెప్పారు. మండలంలోని పలు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం సొసైటీ కేంద్రాల్లో యూరియా బస్తాలను ఆయన ఆదివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా అధికారులతో మాట్లాడుతూ రైతులకు ఎటువంటి నిబంధన లేకుండా, కొందరికి ఎక్కువ కొందరికి తక్కువ అనే తారతమ్యాలు యూరియా అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి అక్కినేని చాముండేశ్వరి, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

20 నుంచి సిపిఐ రాష్ట్ర మహాసభ

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ఈ నెల 20వ తేదీ నుంచి 25 వరకు ఒంగోలులో జరగనున్న సిపిఐ రాష్ట్ర 28వ మహాసభను జయప్రదం చేయాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు చలసాని వెంకట రామారావు పిలుపునిచ్చారు. రాష్ట్ర మహాసభను పురస్కరించుకుని ముద్రించిన వాల్‌పోస్టర్లను ఆదివారం నూజివీడులో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చలసాని రామారావు మాట్లాడుతూ ఒంగోలులో జరగనున్న రాష్ట్ర మహాసభ భవిష్యత్తు ప్రజా ఉద్యమాలకు వేదిక కానుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి నిమ్మగడ్డ నరసింహ, పట్టణ కార్యదర్శి చాట్ల పుల్లారావు, సిపిఐ నాయకులు గంట సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన

ప్రజాశక్తి - ముసునూరు

మండలంలోని గోపవరం గ్రామ పంచాయతీ బిసి కాలనీ (యాదవులు) మల్లాదివారి ఇంటి కొలువైన శ్రీ అంకమ్మ తల్లి ఆలయ శంకుస్థాపన కార్యక్రమం టిడిపి గ్రామ అధ్యక్షులు ఉప్పలపాటి గణేష్, మాజీ అధ్యక్షులు బొల్లినేని బుజ్జి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మల్లాది వారి కుటుంబీకులు, గ్రామ సర్పంచి కంచర్ల వాణి, టిడిపి మండలాధ్యక్షులు గద్దె రఘుబాబు, వైస్ ప్రెసిడెంట్ సాయిల జగ్గయ్య, కార్యదర్శి కర్ర యేసుపాదం, ఎంపిటిసి సభ్యులు గుద్దేటి కన్నమ్మ, కూటమి నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

ప్రకాష్ మృతి తీరని లోటు

ప్రజాశక్తి - టి.నరసాపురం

ప్రముఖ దైవజనులు ప్రొఫెసర్ ప్రకాష్ గంటెల మరణం క్రైస్తవ సమాజానికి తీరని లోటని పోలవరం నియోజకవర్గ పాస్టర్ల జాయింట్ యాక్షన్ కమిటీ (జెఎసి) కార్యదర్శి కురసం నిరీక్షణరావు అన్నారు. మండల పాస్టర్ల జెఎసి సెక్రటరీ బి.కిషోర్ ఆధ్వర్యంలో ఆదివారం గురువాయిగూడెంలో నిర్వహించిన సమావేశంలో పాస్టర్లు ప్రకాష్ గంటెల మృతికి సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా కె.నిరీక్షణరావు మాట్లాడుతూ గుంటూరుకు చెందిన ప్రకాష్ గంటెల అంతర్జాతీయ క్రైస్తవ వేదికలపై ప్రబోధకునిగా క్రైస్తవ సమాజాన్ని ఉజ్జీవ పరిచారని, అంతే కాకుండా సామాజిక సేవలతో పాటు ప్రొఫెసర్‌గా పని చేశారని, పలు డిబేట్లలో వక్తగా ప్రవరించారని తెలిపారు. ఆయన ఈ నెల 15న అనారోగ్యంతో మృతి చెందారని, ఆయన మృతి క్రైస్తవ సమాజానికి తీరని లోటని విచారం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల జెఎసి పాస్టర్లు బ్రదర్ జి.జ్ఞాన్‌రాజు, టి.అకుల, ప్రసన్నరాజు, బి.రమేష్, కె.జాన్, దానియేలు తదితరులు పాల్గొన్నారు.